క్లుప్తంగా

ఓటరు కార్డుల పంపిణీ



కోస్గి: కొత్త ఓటరు కార్డులను ఆదివారం మండలంలోని బీఎల్ఓలు పంపిణీ చేశారు. మున్సిపల్ విలీన గ్రామం సంపల్లిలో తహసీల్దార్ శ్రీనివాసులు బీఎల్ఓ, ఇతర అధికారులతో కలిసి ఓటరు కార్డులను పంపిణీ చేశారు. బూత్ లవారీగా కేటాయించిన కార్డుల పంపిణీని బీఎల్ఓలు పూర్తి చేయనున్నట్లు, ఓటర్లు తమతమ బీఎల్ఓలను సంప్రదించి ఓటరు గుర్తింపు కార్డులను తీసుకోవాలని తహసీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన



మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్‌లో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్‌వనజమ్మఆంజనేయులు దంపతులు హోమంలో కూర్చొని పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, ఆంజనేయులు, సర్పంచ్ మహదేవమ్మ, ఎంపీటీసీ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాలింగేశ్వరస్వామి జాతర

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో శ్రీ మహాలింగేశ్వర స్వామి జాతర ఆదివారం ముగిశాయి. చివరిరోజు స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన నిర్వహించారు. సాయంత్రం బీరప్ప ఆలయం నుంచి గ్రామ పురవీధుల గుండా భక్తి శ్రద్ధలతో మేళతాళాలతో స్వామివారి పల్లకి సేవా నిర్వహించారు.

కొనసాగుతున్న ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వం పేదలకోసం అమలుచేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని జెడ్పీవైస్ చైర్‌పర్సన్ సురేఖ అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీకళ, సుజాత, గోపాల్, రాజేష్, పూల్లయ్యగౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

- ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ గెలుపుఖాయమని చిట్టెం చాణిక్యా రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్లంపల్లిలో ఇంటింటి ప్రచారం చేసి మాట్లాడారు.. చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేసి ఓటు అభ్యర్థించారు.
- కర్ణాటక రైతులు తెలంగాణలో కేసీఆర్‌ను గెలుపించాలని ఆదివారం ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు రాష్ట్ర సరిహద్దులోని వాసుగన్ వద్ద కృష్ణా బ్రిడ్జిపైకి కర్ణాటకకు చెందిన రైతులు చేరుకోగానే వారికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు.
- కొత్తపల్లి మండలంలోని భూనీడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎంపీటీసీ కోట్ల నారాయణరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, సురేందర్‌గౌడ్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే మండలంలోని దోరేపల్లి, దమ్‌గాన్‌పూర్ గ్రామానికి చెందిన యువకులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.
- మండలంలోని మల్‌రెడ్డిపల్లికి చెందిన ఉప సర్పంచ్ నవితసాయిలు స్థానిక కాంగ్రెస్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ పెరుమళ్ల ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు.
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అసత్య ప్రచారంతో కొడంగల్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... రేవంత్‌రెడ్డికి ఈ సారి ఓటమి తప్పదన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసిన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తనను ప్రజలు మరోమారు గెలిపించడం ఖాయమన్నారు.

ప్రమాదకరంగా మలుపు

మరికల్: మండల కేంద్రం నుంచి కన్మనూర్, నర్వ వెళ్లే రహదారిపై ఉన్న మలుపుల వద్ద సూచికబోర్డులు లేక కొత్తగా వచ్చే వాహనదారులకు భయపెట్టిస్తుంది. మరికల్, కన్మనూర్ గ్రామాల మధ్యన ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. దీంతో తరచుగా బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుమలుపు వద్ద అధికారులు స్పీడ్ బ్రేకర్లను వేయించి, సూచికబోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



బండెనక బండి కట్టి..



నర్వ నుంచి కురుమూర్తి జాతరకు వెళ్తున్న భక్తులు

- కురుమూర్తి జాతరకు తరలిన పల్లెజనం

నర్వ/ మరికల్: బండెనక బండి కట్టి.. కురుమూర్తి కొండకు దండు కట్టి.. భక్తులు ఆదివారం ఉద్దాల ఉత్సవాలకు పల్లెజనం నుంచి భారీగా తరలివెళ్లారు. కురుమూర్తిస్వామి జాతర ఉత్సవాలకు రైతులు తమ ఎద్దుల బండ్లలో కురుమూర్తి కొండకు బయలుదేరగా.. కొంతమంది ట్రాక్టర్లు, ఆటోలు, ఆర్టీసీ బస్సుల ద్వారా తరలివెళ్లారు. మక్తల్, నారాయణపేట ప్రాంతాల నుంచి బతుకుదెరువు కోసం ముంబాయి, పుణె, హైదరాబాద్ తదితర వెళ్లిన వారు ఈ ఉత్సవాలకు ప్రతిఏటా తిరిగి వస్తుంటారు. ఉత్సవాలకు తమ ఇళ్లను ముస్తాబు చేసుకొని స్వామివారి దర్శనానికి తరలివెళ్లారు.



మరికల్ నుంచి ఎద్దుల బండ్లపై..

జాయమ్మ చెరువు నింపి.. రైతుల పాదాలు కడుగుతా



నారాయణపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: రైతాంగానికి ఎన్నో ఏళ్ల నుంచి కలగంటున్నా జాయమ్మ చెరువుకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీరు నింపి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతుల పాదాలు కడగడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని పేరపళ్లలో ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామంలో వచ్చి పోయే ఆటోలోని ప్రయాణికులు పలకరించారు. ఈ సారైనా పేరపళ్ల జాయమ్మ చెరువుకు సాగునీరు వస్తుందా అంటూ రైతులు ఎమ్మెల్యే ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి లైన్ క్లియర్ అయ్యిందని.. త్వరలోనే కాల్వల తవ్వకాలు పూర్తయ్యి ఏడాదిలోపే చెరువుకు కానుకుర్తి ఎత్తిపోతల రిజర్వాయర్ నుంచి నీరు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

సంపద పెంచాలే..

ప్రజలకు పంచాలన్నదే కేసీఆర్ లక్ష్యం

రాష్ట్రంలో అన్ని రంగాల్లో సంపద పెంచి నిరుపేదలకు పంచాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని భీమండికాలనీలో ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి తరపున ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఏటేటా ఆసరా పింఛన్లు పెంచేందుకు కొత్త మేనిఫెస్టో రూపొందించారని ఓటర్లకు వివరించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి ఇంటికి రైతు బీమా తరహాలో జీవిత బీమా రూ.5 లక్షలు కల్పిస్తారన్నారు. బీజేపీ హయంలో పెరిగిన వంట గ్యాస్‌తో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రూ. 400కే బీఆర్ఎస్ గ్యాస్ సిలిండర్‌ను అందిస్తుందని తెలిపారు.

దామరగిద్ద: అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని గెలిపించుకుందామని మండల బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారం చేశారు. ఆదివారం మండలంలోని దామరగిద్ద, కాన్‌కుర్తి, మల్‌రెడ్డిపల్లి, లోకుర్తి, మద్దెల్‌బీడ్, క్యాతన్‌పల్లి, మొగుల్‌మడ్క, సజానాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారుగుర్తుకు ఓటేయ్యాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, ఈదప్ప, భీమయ్యగౌడ్, కిషన్‌రావ్, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శరణప్ప, చంద్రకాంత్, బసంత్‌రాజ్, అశోక్‌గౌడ్, కన్కిరెడ్డి మాణిక్యప్ప పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మతాన్ని గౌరవించుకోవాలి

- సర్వ ధర్మ సమ్మేళనంలో వక్తలు



మాట్లాడుతున్న వక్తలు

నారాయణపేట: స్థానిక కొల్లంపల్లిలో హజ్రత్ సయ్యద్ షా అహ్మద్ ఖతాల్ హుస్సేనీ వార్షిక ఉర్సును ఆదివారం అఫ్రషియా ఎడ్యుకేషన్ సోసైటీ కొల్లంపల్లి ఆధ్వర్యంలో సర్వధర్మ సమ్మేళనం నిర్వహించారు. ధార్మిక సదస్సుకు సయ్యద్‌షా మహ్మద్ హుస్సేనీ సూఫీ సజ్జాద్ నాషిన్ గోగి షరీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డితో పాటు వక్తలు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మతాన్ని గౌరవించుకోవాలని ఇలాంటి సదస్సుల ద్వారా సర్వమతాల ఐక్యత పెంపొందుతుందని వక్తలు అన్నారు. కార్యక్రమంలో పంచమస్ సిద్ధిలింగ మహాస్వామి, మౌలానా సయ్యద్ ముస్తాఫా ఖాద్రి కర్ణాటక, సయ్యద్ జలాల్ హుస్సేనీ షమీమ్ కొయిల్‌కొండ, మౌలాన అబ్దుల్ నాసిర్ మజాహరి, టీపీసీసీ సభ్యులు చిట్టెం అభిజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హర్షకిరణ్

నారాయణపేట రూరల్: విద్యార్థులు ఇష్టంతో చదివితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, బట్టీ విధానానికి స్వస్తిపలకాలని మోటివేషనల్ స్పీకర్ హర్షకిరణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ సాయిస్కూల్‌లో లైఫ్ స్కిల్స్, ఫ్యూచర్ కెరియర్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హర్షకిరణ్ మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి జీవితంలో మొదటి 25 సంవత్సరాలు కష్టపడితే 75 ఏళ్లు ఆనందంగా జీవిస్తాడన్నారు. మొదట్లో సెల్‌ఫోన్, టీవీలు, ఎంజాయ్‌మెంట్ అంటు కాలాన్ని వృథా చేస్తే జీవిత కాలం బాధపడాల్సి ఉంటుందన్నారు. ఇబ్బందలన్నింటిని పాజిటివ్ కోణంలో చూడాలని, పరీక్షల సమయంలో భయానికి లోనుకాకుండా ధైర్యంగా ఉండాలన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాల నిర్వహకురాలు శేషమ్మ, కవిత కరస్పాండెంట్ సాయిలీల, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ప్రత్యేక పోలీస్ బలగాలు

కోస్గి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్సై శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో పోలీసులు, కేంద్ర ప్రత్యేక బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు శాఖ ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తుందని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మనోధైర్యం కల్పించడంతో పాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు పట్టణంలో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై–2 నరేష్‌తోపాటు ఆర్ఎస్ఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠాపన ఉత్సవాలు



గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో మూడు రోజులుగా చేస్తున్న బొడ్రాయి, ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం నర్సింహస్వామి, హనుమాన్, శివాలయం ఆలయాల ఎదుట ధ్వజస్తంభ, ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠ, గ్రామంలో 9 కూడళ్లలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలను పూర్తి చేశారు. చెరువు నుండి 108 కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం బోనాల ప్రదక్షిణ చేశారు. గ్రామస్తులు సామూహిక భోజనం చేశారు. మూడురోజుల పాటు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారెడ్డి, అనంతలక్ష్మారెడ్డి, అనంతసేనారెడ్డి, గోపాల్, రాంరెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ఇందిరాగాంధీ కృషి



స్టేషన్ మహబూబ్‌నగర్: దేశాభివృద్ధి కోసం దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విశేష కృషి చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కొత్వాల్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ తన హయాంలో బ్యాంకులను జాతీయం చేయడం, రాజాభరణాలను రద్దు చేయడంలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. భూసంస్కరణల ద్వారా పేదలకు ఉచితంగా భూములు పంచిపెట్టిన ఘనత ఆమెకే దక్కిందని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, చంద్రకుమార్‌గౌడ్, సీజే బెనహర్, సిరాజ్ ఖాద్రీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పట్టవా?

మాగనూర్: రోడ్డు నిబంధనలు తప్పనిసరి అంటూ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా కొందరు పట్టించుకోవడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ముఖ్యంగా పలు గ్రామాలకు బస్సుసౌకర్యం లేని కారణంగా ఆటోలు, జీపులో ఎక్కువమందిని తరలిస్తూ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఒక ఆటోలో నిబంధనల ప్రకారం ఆరుమంది ప్రయాణించాల్సి ఉంటుంది. కానీ ఒకే ఆటోలో 15నుంచి 20మందిని తరలిస్తున్నారు. దీంతో అనుకొని ప్రమాదం జరిగితే భారీప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

థియేటర్‌లో క్రికెట్ మ్యాచ్ ప్రదర్శన

జడ్చర్ల టౌన్: వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్‌ను అభిమానుల కోరిక మేరకు పట్టణంలోని థియేటర్‌లో ప్రదర్శించారు. మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాటింగ్ చేస్తున్నంతసేపు ప్రేక్షకులు ఈలలు వేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఆదివారం కావటం ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ ఉండటంతో యువకులు, చిన్నారులు ఇళ్లలో టీవీ ముందు కూర్చోవటంతో పట్టణంలోని ప్రధాన రోడ్లు వెలవెలబోయాయి. వివాహాలు ఉండటంతో వారు మాత్రమే రోడ్లపైకి వచ్చారు.

టీవీలకు అతుక్కుపోయిన జనం

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆదివారం ఇండియా–ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌ను పురస్కరించుకుని పాలమూరు పట్టణంలో జనం టీవీలకు అతుక్కుపోయారు. మ్యాచ్ సందర్భంగా మధ్యాహ్నం నుంచి పాలమూరు పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. క్రీడాకారులు మైదానంలో జాతీయ జెండాలతో సందడి చేశారు.



పేదల సంక్షేమమే ఎజెండా



మందిపల్లిలో మాట్లాడుతున్న వాకిటి శ్రీహరి

మక్తల్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తామని మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మాగనూర్ మండలంలోని మందిపల్లి, గజ్జరన్‌దొడ్డి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌పై ప్రజలకు అభిమానం ఉందని, ఎన్నికల్లో ఓట్ల రూపంలో చూపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ పేదల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరుతున్న వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మక్తల్ పట్టణంలో వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, గడ్డంపల్లి హన్మంతు, ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సిద్ధార్థరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్‌యాదవ్, అంజనేయయులుగౌడ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించి దేశ వ్యాప్తంగా పేదరికం నిర్మూలనకు కృషి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ అన్నారు. వాకిటి శ్రీహరికి మద్దతుగా ఆదివారం పట్టణంలోని మూడో, నాల్గో వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తౌఫిక్, అస్సు, జుబేర్ అహ్మద్, ప్రకాష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ముడుమాల్, మురహర్‌దొడ్డి, టైరోడ్డు, వాసునగర్ గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ అభ్యర్థి వాకటి శ్రీహరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో క్రిష్ణమూర్తి, నారాయణ, ముడుమాల్ భీమశంకర్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వండి



మక్తల్‌లో మాట్లాడుతున్న డీకే అరుణ



నాగిరెడ్డిపల్లిలో ప్రచారం చేస్తున్న మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి

మక్తల్: అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం నర్వ మండలంలోని నాగిరెడ్డిపల్లిలో జలంధర్‌రెడ్డి, మక్తల్ పట్టణంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య, జలంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. మక్తల్‌లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు.

కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి..

రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతి పాలన కొనసాగుతుందని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఆదివారం మక్తల్‌లో జలంధర్‌రెడ్డికి మద్దతుగా నల్లజానమ్మ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు రోడ్ షో నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్‌పర్సన్ అఖిలారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కర్ని స్వామి, ఈసరి నాగప్ప, కౌన్సిలర్లు కౌసల్య, అర్చన, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, రంగప్ప, తిమ్మప్ప, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, నాగప్ప, కుర్వ లింగం, ద్యావరింటి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అమరచింత: నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థి జలేంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి కోరారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో బీజేపీ మహిళా మోర్చా నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సుజాత, అంజలమ్మ, క్యామ భాస్కర్, మేర్వరాజు, అశోక్, నారాయణ, వెంకటేశ్వర్లు, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి, నరాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని జిన్నారం, చిత్తనూర్, ఎక్లాస్‌పూర్ తదితర గ్రామాల్లో జలంధర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమ పాలన అదిస్తామన్నారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవుడిపై కృతజ్ఞతగా ఉండి రాణించాలి



కృతజ్ఞతర్పాణ పండుగ వేడుకల్లో క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏసు ప్రభువు నిత్యం ఏదో ఒక మేలు చేసే గొప్ప దేవుడని, ఇందుకు మనమంతా ఆయనకు తిరిగి కృతజ్ఞత చెల్లించేగా వారిగా ఉండాలని అంతర్జాతీయ ముఖ్య ప్రసంగీకులు రెవ.బీఎస్ పరంజ్యోతి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఏనుగొండ సమీపంలోని రెమా వర్షిప్ సెంటర్‌లో డైరెక్టర్ బీఎస్.పరంజ్యోతి అధ్యక్షతన అదివారం కృతజ్ఞతార్పణ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మనం భూమి మీద జన్మించినప్పటి నుంచి నిత్యం దేవుని ద్వారా మేలుల్ని పొందుతూనే ఉంటామని, ఇందుకు దేవుడు మన నుంచి కేవలం కృతజ్ఞతను మాత్రమే ఆశిస్తాడన్నారు. ఈ విషయాన్ని ప్రతి విశ్వాసి గుర్తుంచుకోవాలని కోరారు. అనంతరం పరిశుద్ధ బైబిల్‌లోని కొందరి వ్యక్తుల జీవితాల్ని విశ్వాసులకు వివరిస్తూ, కృతజ్ఞత ప్రత్యేకతను తెలియజేసేందుకే ఏడాదికోసారి ఈ పండుగల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆకట్టుకున్న వేలం పాట..

కృతజ్ఞతార్పణల పండుగ సందర్భంగా విశ్వాసులు స్వయంగా తయారు చేసుకొని వచ్చిన పిండి వంటలు, ఇతరత్రా ప్రత్యేకత కలిగిన పండ్లకు వేలం పాట నిర్వహించారు. పోటీ పడి కొనుగోలు చేయడంతో అందర్ని ఆకటుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్లు మోహన్, తిమోతి, వేదాంతి, సంఘ పెద్దలు దేవయ్య, లక్ష్మన్న, అనిల్, స్వామి, రామంజనేయులు, సిస్టర్స్ బ్లాండీనా, ప్రైయిజీ రాణి, మేరి, మహిమతోపాటు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.